



# చంద్రన్నకు పట్టాభిషేకం

ఐదేళ్ల అరాచక పాలనకు చరమగీతం పాడి.. 5 కోట్ల ఆంధ్రుల ఆశలు, ఆశయాలను
ప్రతిబింబిస్తూ నేటి నుంచి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నవశకానికి నాంది పలకబోతున్న
శ్రీ **నారా చంద్రబాబునాయుడు** గారికి
మా హార్ధిక శుభాభినందనలు



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

అదీ.. లోకేష్ స్టయిల్!



8

## కక్షసాధింపులుండవు.. తప్పుచేసిన వాళ్లను చట్టప్రకారం శిక్షిస్తాం

టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టీకరణ

- నేటి నుంచి ప్రజాపాలన ప్రారంభమవుతుంది
- ప్రతి అడుగు ప్రజల కోసమే
- ఘనవిజయంతో విర్రవీగొద్దు
- అధికారాన్ని బాధ్యతగా తీసుకుందాం
- పోలవరం పూర్తి చేసి ప్రతి ఎకరాకూ నీళ్లు
- పవన్ మద్దతును ఎప్పటికీ మర్చిపోను
- ప్రజల నమ్మకాన్ని నిలబెడదాం.... తెలుగు జాతిని నెంబర్-1 చేద్దాం
- ఘనవిజయాన్ని అందించిన ప్రజలకు శిరసు వంచి నమస్కరిస్తున్నా
- ఎన్డీఏ శాసనసభా పక్షనేతగా ఏకగ్రీవంగా ఎన్నిక
- ముఖ్యమంత్రిగా నేడే ప్రమాణ స్వీకారం

2

# చంద్రబాబు 4.0



- నాలుగోసారి ముఖ్యమంత్రిగా నేడే ప్రమాణ స్వీకారం
- కేసరపల్లి ఐటీ పార్క్ వద్ద సర్వం సిద్ధం
- హాజరుకానున్న మోదీ, అమిత్ షా, కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల సీఎంలు, సినీ దిగ్గజాలు రజనీకాంత్, చిరంజీవి
- కట్టుదిట్టమైన భద్రత, పకడ్బందీగా ఏర్పాట్లు

- వివరాలు 3 లో..

# 25మందితో బాబు కేబినెట్

తెదేపా నుంచి 21మందికి ఛాన్స్ • జనసేనకు మూడు, బీజేపీకి ఒకటి

పవన్, లోకేష్, మనోహర్‌కు చోటు





అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బుధవారం ఉదయం 11.27 గంటలకు కేసరపల్లి ఐటీ పార్క్ వద్ద ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయనతోపాటు కూటమినుంచి గెలుపొందిన 24మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం చేయనున్నారు. చంద్రబాబు కేబినెట్‌లో తెదేపా నుంచి 21మంది ఎమ్మెల్యేలకు, జనసేన నుంచి ముగ్గురికి, బీజేపీనుంచి ఒకరికి చోటుదక్కింది. కేబినెట్ కూర్పుపై మంగళవారం అర్ధరాత్రి వరకూ తెదేపా, జనసేన, బీజేపీ నేతలు సమావేశమై చర్చించారు.

బీజేపీ ఎమ్మెల్యేల్లో ఎవరికి మంత్రి పదవులు ఇవ్వాలన్న అంశంపై చంద్రబాబుతో కేంద్రమంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా భేటీ అయ్యారు. బీజేపీ నుంచి ఇద్దరికి చోటుదక్కవచ్చన్న ఊహాగానాలు వినిపించినా.. ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్‌కు కేబినెట్‌లో చోటు దక్కింది. ఇక జనసేన పార్టీనుంచి మొత్తం 21మంది ఎమ్మెల్యేలుగా ఘన విజయం సాధించారు. ఆ పార్టీలో ముగ్గురికి మంత్రి పదవులు దక్కాయి. పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌తోపాటు, కీలక నేత నాదెండ్ల మనోహర్, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే కందుల దుర్గేష్‌కు మంత్రివర్గంలో చోటు దక్కింది. ఇక తెలుగుదేశం పార్టీనుంచి 21మంది ఎమ్మెల్యేలకు మంత్రిగిరి దక్కింది. వారిలో కింజరాపు అచ్చెన్నాయుడు, నారా లోకేష్, కొల్లు రవీంద్ర,పి.నారాయణ, వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, ఎన్ఎమ్‌డి ఫరూక్, ఆనం రామ నారాయణరెడ్డి, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్,కొలుసు పార్థసారధి, డోలా బాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవి, గుమ్మడి సంధ్యారాణి, బీసీ జనార్ధన్ రెడ్డి, టీజీ భరత్, ఎస్ సవిత, వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్, మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డిలకు స్థానం దక్కింది.

### సామాజిక వర్గం లెక్కలిలా...

సామాజిక వర్గం లెక్కల ప్రకారం చంద్రబాబు కేబినెట్‌లో జనసేన నుంచి నాదెండ్ల మనోహర్, తెదేపా నుంచి పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవి, నారా లోకేష్‌లతో నలుగురు కమ్మ వర్గీయులకు అవకాశం దక్కింది. ఇక కాపు వర్గంలో నలుగురికి జనసేన నుంచి పవన్ కళ్యాణ్, కందుల దుర్గేష్, తెదేపా నుంచి పి నారాయణ, నిమ్మల రామానాయుడుకు అవకాశం దక్కింది. రెడ్డి వర్గీయుల్లో ఆనం రామనారాయణరెడ్డి, మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్ధన్ రెడ్డికి చోటు దక్కింది. ప్రధానమైన బీసీ సామాజిక వర్గం నుంచి ఎనిమిది మందికి కేబినెట్‌లో చోటు దక్కింది. వీరిలో అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, వాసంశెట్టి సుభాష్, కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్, ఎస్ సవిత, సత్య కుమార్ యాదవ్ (బీజేపీ)లకు చోటు దక్కింది. వైశ్య వర్గం నుంచి భరత్‌కు, మైనారిటీ వర్గం నుంచి ఎన్ఎండి ఫరూక్, ఎస్సీ వర్గం నుంచి వంగలపూడి అనిత, డోలా బాలవీరాంజనేయస్వామి, ఎస్టీ వర్గం నుంచి గుమ్మడి సంధ్యారాణి కొత్త కేబినెట్‌లో చోటు దక్కించుకున్నారు.

## చంద్రబాబు అనుభవం, శక్తి రాష్ట్రానికి అవసరం

సమిష్టిగా ప్రభుత్వాన్ని నడిపిద్దామని కూటమి ఎమ్మెల్యేలకు పవన్ పిలుపు



6

చంద్రబాబుతో అమిత్ షా భేటీ

6

అమరావతే రాజధాని... ఆర్థిక రాజధానిగా విశాఖ - చంద్రబాబు

10

చెమర్చిన కళ్లతో బాబు గాఢాలింగనం!



7

# కక్షసాధింపులుండవు..
# తప్పుచేసిన వాళ్లను చట్టప్రకారం శిక్షిస్తాం

## టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టీకరణ

- నేటి నుంచి ప్రజాపాలన ప్రారంభమవుతుంది
- ప్రతి అడుగు ప్రజల కోసమే
- ఘనవిజయంతో విర్రవీగొద్దు
- అధికారాన్ని బాధ్యతగా తీసుకుందాం
- పోలవరం పూర్తి చేసి ప్రతి ఎకరాకూ నీళ్లు
- పవన్ మద్దతును ఎప్పటికీ మర్చిపోను
- ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడదాం.... తెలుగు జాతిని నెంబర్-1 చేద్దాం
- ఘనవిజయాన్ని అందించిన ప్రజలకు శిరసు వంచి నమస్కరిస్తున్నా
- ఎన్డీఏ శాసనసభా పక్షనేతగా ఏకగ్రీవంగా ఎన్నిక
- ముఖ్యమంత్రిగా నేడే ప్రమాణ స్వీకారం



అమరావతి(చైతన్యరథం): టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో రెండుసార్లు,విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ఒకసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన చంద్రబాబు బుధవారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా మరోసారి పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తన దార్శనికతతో హైదరాబాద్‌ను ఐటీ రాజధానిగా అభి వృద్ధిలో కొత్తపుంతలు తొక్కించారు. విజన్ 2020పేరిట చంద్రబాబు దూరదృష్టితో రూపుదిద్దుకున్న ప్రణాళిక.. హైదరాబాద్‌లో అంతర్భాగంగా సైబరాబాద్ అనే నూతన అత్యాధునిక, సంపన్న నగరాన్ని సృష్టించింది. నేడు హైదరాబాద్ విశ్వనగరంగా భాసిల్లు తోందంటే చంద్రబాబు వేసిన నాలెడ్జ్ ఎకానమీ అనే పునాదులే కారణం. విభజిత ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా కూడా చంద్రబాబు తన అనుభవంతో కొత్త రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించారు. అనేకానేక కొత్త పరిశ్రమల రాక ఒకవైపు, శరవేగంగా నిర్మాణం జరుపుకుంటున్న పోలవరం ప్రాజెక్ట్ మరో వైపు,అన్నింటినీ మించి అన్ని అడ్డంకులూ తొలగిపోయి ప్రజా రాజధాని అమరావతి నిర్మాణం ఊపందు కుంటున్న వేళ 2019 ఎన్నికల్లో టీడీపీ ఓటమి రాష్ట్రానికి శరాఘాతంలా తగిలింది. గత ఐదేళ్లుగా జగన్‌రెడ్డి విధ్వంస పాలనలో అన్ని రంగాల్లోనూ సర్వ నాశనమైన రాష్ట్రంలో కోలుకోలేని విధంగా దెబ్బతిన్న ప్రజలు మరోసారి తప్పు చేయబోమంటూ అభివృద్ధి సాధకుడు చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి ఈ సారి ఎన్నికల్లో అఖండ విజయం అందించారు.

ఈ నేపథ్యంలో మంగళవారం విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఎన్డీఏ ఎమ్మెల్యేల సమావేశంలో కూటమి శాసనసభా పక్షనేతగా చంద్రబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.టీడీపీ,జనసేన,బీజేపీ ఎమ్మెల్యేలు పాల్గొన్న ఈ సమావేశంలో ఎన్డీఏ శాసన సభా పక్షనేతగా చంద్రబాబుపేరును జనసేనాని పవన్‌కళ్యాణ్ ప్రతిపాదించగా టీడీపీ రాష్ట్రఅధ్యక్షుడు అచ్చెన్నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి బలపరచగా, కూటమి ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఈక్రమంలో గన్నవరం సమీపంలోని కేసరపల్లి ఐటీ పార్క్ వద్ద చంద్రబాబు బుధవారం ఉదయం 11.27 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా సహా పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మెగాస్టార్ చిరంజీవి సహా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరవుతున్నారు.

### అధికారాన్ని బాధ్యతగా భావించాలి

ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేల సమావేశంలో టీడీపీ అధినేత చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇక నుంచి ప్రజాపాలన సాగుతుందని... ప్రతి నిర్ణయం... ప్రతి అడుగు ప్రజల కోసమే ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజావేదికలా కూల్చివేతలు,మూడు రాజధానుల పేరుతో ఆటలు ప్రజా ప్రభుత్వంలో ఉండవని ఉద్ఘాటించారు. బాధ్యతాయుతమైన, ఒక పాజిటివ్ గవర్నమెంట్ ఉంటుందని చంద్రబాబు అన్నారు. ప్రజలు తమకు ఇచ్చింది అధికారం కాదని... అత్యున్నతమైన బాధ్యత అని పేర్కొన్నారు. అశాంతికి తావు లేకుండా రాష్ట్రంలో పాలన ఉంటుందన్నారు. తాను చాలా ఎన్నికలు చూశానని, ఈ ఎన్నికల్లో ప్రజలు రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తీర్పు ఇచ్చారన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును నిలబెట్టుకునే బాధ్యత మనందరిపై ఉంది. కూటమికి ఘన విజయాన్ని అందించిన ప్రజలకు శిరసువంచి పాదాభివందనం చేస్తున్నా. ప్రమాదంలో ఉన్న రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ప్రజలు చొరవ చూపారు. ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలవాలి అనేది మన లక్ష్యమని ఎన్నికల ముందు ప్రచారంచేశాం. ప్రజలు గెలిచారు...రాష్ట్రాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనపై ఉంది. అరాచక, విధ్వంసకర పాలనను ఐదేళ్ల ప్రజలు భరించారు. మూడు పార్టీలు అత్యున్నత ఆశ యాలతో పొత్తు పెట్టుకున్నాయి. ఎన్నోసార్లు కలయిక జరిగినప్పటికీ ఇప్పటి పొత్తును నూటికి నూరుశాతం కార్యకర్తలు, నేతలు స్వాగతించి సమష్టిగా పని చేశారు. కూటమి విజయానికి కష్టపడ్డ మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలను మనస్ఫూర్తిగా అభినందిస్తూ కృతజ్ఞతలు తెలుపుతున్నానని చంద్రబాబు అన్నారు.

### ప్రజలు పెట్టుకున్న నమ్మకంతోనే ఇంతటి విజయం

1994లో జరిగిన ఎన్నికలు ఏకపక్షంగా జరిగినప్పటికీ ఇన్ని ఓట్లు, సీట్లు రాలేదు. ఈ ఎన్నికల్లో మనం ఓడిపోయింది కేవలం 11 సీట్లలో మాత్రమే. 93శాతం స్ట్రైక్ రేట్‌తో 57శాతం ఓట్లను కూటమి సాధించింది. ఇది గెలుపు మాత్రమే కాదు... మనపై ఉన్న బాధ్యత. శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, అమలాపురం, ఏలూరు, రాజమండ్రి, మచిలీపట్నం, కృష్ణా, గుంటూరు, నరసరావుపేట, నెల్లూరు, అనంతపురం, హిందూపురం, చిత్తూరు, నంద్యాల పార్లమెంట్ స్థానాల పరిధిలో కూటమి క్లీన్ స్వీప్ చేసింది. జనసేన 21 సీట్లలో పోటీ చేసి 21స్థానాలనూ గెలిచింది. బీజేపీ 10 స్థానాల్లో పోటీ చేస్తే 8చోట్ల విజయం సాధించింది. ప్రజలు మనల్ని ఆశీర్వదించి గెలిపించారు. మనకు ఇలాంటి విజయం... ఇంతటి సంతోషం ఎప్పుడూ లేదు. దీనికి కారణం ప్రజలు మనపై పెట్టుకన్న నమ్మకం. 95 వేల ఓట్ల మెజార్టీతో గాజువాకలో టీడీపీని గెలిపించారు. ఫలితాలతో ఏపీ ప్రతిష్ట,గౌరవం పెరిగింది. ఏ స్థానాన్ని ఏ అభ్యర్థికి కేటాయించాలో నిర్ణయించిగెలుపే ధ్యేయంగా సీట్లు కేటాయించామని చంద్రబాబు వివరించారు.

### కష్టకాలంలో పవన్ కళ్యాణ్ మద్దతు ఎప్పుడూ మర్చిపోలేను

అక్రమ కేసులతో నన్ను జైల్లో పెట్టినప్పుడు పవన్ కళ్యాణ్ ఇచ్చిన మద్దతును ఎప్పుడూ మరిచిపోను. నేను రాజమండ్రి జైల్లో ఉన్నప్పుడు నన్ను పరామర్శించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని గతంలో చెప్పినప్పటికీ జైల్లో నన్ను కలిసిన అనంతరం పొత్తు ప్రకటించారు. మూడు పార్టీలు కలిసి పోటీ చేసేందుకు చొరవ తీసుకున్నారు. ఎన్నికల సమయంలో ధర్మవరంలో పర్యటించిన కేంద్రహోంమంత్రి అమిత్ షా వైసీపీ ప్రభుత్వ అవినీతిని ఎండగట్టడంతో పాటు ఏపీకి ఏం అవసరమో చెప్పారు.దీంతో ప్రజల్లో ఒక ఆలోచన మొదలైంది. కూటమిపై నమ్మకం పెరిగింది. చిలకలూరిపేట, రాజమండ్రి, అనకాపల్లి, రాజంపేట సభలతోపాటు విజయవాడ రోడ్ షోలో మోదీ పాల్గొన్నారు. ఈ సభలు, రోడ్ షోలకు ప్రజల నుండి విశేషమైన స్పందన వచ్చింది. కూటమి నేతలు, కార్యకర్తలు ఈ ఎన్నికల్లో కష్టపడ్డ విధానం ఎప్పుడూ చూడలేదు... ప్రతి ఒక్కరూ మనసు పెట్టి పనిచేశారు.మీ సహకారంతోనే 4వ సారి సీఎంగా బుధవారం ప్రమాణస్వీకారం చేస్తున్నా. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడతాం. మళ్లీ ప్రజల రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైంది. రాష్ట్రం ఉన్న పరిస్థితుల్లో కేంద్ర సహకారం కూడా అవసరం... ఈ మేరకు కేంద్రం కూడా హామీ ఇచ్చింది. మోదీ, అమిత్, నడ్డాతో పాటు కేంద్ర నాయకత్వాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని చంద్రబాబు అన్నారు.



### నాకు తెలిసింది ప్రజాహితం.. ప్రజల కోసం కష్టపడటమే

45 ఏళ్ల నా రాజకీయ జీవితంలో రాగద్వేషాలకు అతీతంగా పనిచేశాను. ప్రజల కోసం కష్టపడటం, ప్రజాహితమే నాకు తెలుసు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడతా. నా ప్రతి ఆలోచన, తపనంతా ప్రజల కోసమే. ఎన్నో విజయాలు చూశాను... సంక్షోభాలు చూశాను. సంక్షోభాలను అవకాశాలుగా మార్చుకున్నాం. రాష్ట్రంలో చాలా సమస్యలు ఉన్నాయి. పేదల జీవితాలు మార్చడానికి నిత్యం పనిచేసి మన నిజాయితీని ప్రజలకు తెలియజేద్దాం. రాష్ట్రం పూర్తిగా శిథిలమైంది. వైసీపీ పాలనలో దెబ్బతినని వర్గమంటూ లేదు. పక్క రాష్ట్రాల్లో చిన్న చిన్న పనులుచేసుకునే వారు సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని వచ్చి ఓట్లువేసి వెళ్లారు. విదేశాల్లో ఉన్నవారు లక్షల ఖర్చు పెట్టుకుని వచ్చి ఓట్లు వేశారు. ఓటర్లు బాధ్యతగా నిర్వర్తించిన ప్రవర్తన తెలుగుజాతి చరిత్రలో నిలిచిపోతుంది. ఏ అహంకారంతో పాలకులు విర్రవీగారో అది పూర్తిగా అనిగిపోయింది. పదవుల్లో ఉన్నామని విర్రవీగితే ఇలాంటి ఫలితాలే వస్తాయి. ఇవన్నీ కేస్ స్టడీగా మీరు తీసుకోవాలి. ప్రజలు.. బూతులు మాట్లాడిన నేతలు, అరాచక శక్తులు, అవినీతి పరుల్ని చూశారు. పాలకులు అంటే ఎలా ఉండాలో చూశారు...పాలకుడికి ఎలాంటి అర్హత ఉండాలో కూడా ఈ తీర్పు ఒక సూచికం. జగన్ ప్రవర్తన చూశాక ఇలాంటి వ్యక్తి పాలనకు పనికి రాడని ప్రజలు నిర్ణయించుకుని తీర్పునిచ్చారు. పాలన ఎలా ఉండకూడదో.. గత పాలన ఒక నిదర్శనమని చంద్రబాబు వివరించారు.

### గౌరవసభగా శాసనసభను నడుపుదాం

కక్ష తీర్చుకోవాలని ముందకెళ్తే సమస్యలే వస్తాయి. అలాగని తప్పు చేసిన వారిని క్షమించి పూర్తిగా వదిలేస్తే మళ్లీ అదే దారికి వస్తారు. చట్ట పరంగా శిక్షించడంతో పాటు విధ్వంసం, కక్ష రాజకీయాలు చేయకుండా సరైన దారిన పెట్టాలి. కార్యకర్తలపై దాడులు చేసి కేసులు పెట్టి వేధించారు.ఇబ్బందుల్లో ఉన్నవారిని మనం కాపాడుకున్నాం. నడి వీధుల్లో ప్రాణాలు తీస్తూ అరాచకంగా ప్రవర్తించారు. మెడపై కత్తి ఉన్నా జై తెలుగుదేశం అంటూ ప్రాణాలు వదిలిన ఘటన నా కళ్ల ముందు ఇప్పటికీ తిరుగుతోంది. నాకు కూడా అసెంబ్లీలో అవమానం జరిగింది... దాన్ని భరించలేక మళ్లీ ముఖ్యమంత్రిగానే అసెంబ్లీలో అడుగుపెడతానని శపథం చేసి బయటకు వచ్చాను. అసెంబ్లీని గౌరవ సభగా మార్చుతానని చెప్పాను. మనం శాసనసభను గౌరవ సభగా మార్చి ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు వేదికగా మార్చుకుందాం." అని చంద్రబాబు అన్నారు.

### నిర్మాణాత్మక రాజకీయాలు చేద్దాం

రాష్ట్రానికి ఎంత అప్పు ఉందో తెలీదు... ఎక్కడ నుండి తెచ్చారో తెలీదు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైంది. సాగునీటి వ్యవస్థ నిర్వీర్యం అయింది. వ్యవసాయం రంగం పూర్తిగా సంక్షోభంలో ఉంది. ఐదేళ్లలో 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారు. పదేళ్ల తర్వాత కూడా రాజధాని ఏది అంటే చెప్పుకోలేని పరిస్థితి. ప్రజల సమస్యలు చెప్పుకోవడానికి నిర్మించిన ప్రజావేదికను కూల్చి దుర్మార్గంగా వ్యవహరించారు. కక్ష పూరిత రాజకీయాలు కాకుండా నిర్మాణాత్మక రాజయాలు పాటిద్దాం. 2014లో సీఎంగా ప్రమాణస్వీకారం చేయడానికి ముందు ఢిల్లీ వెళ్లాను. పోలవరం ముంపు మండలాలు 7 తెలంగాణలో ఉన్నాయి. ఆ 7మండలాల్లో పునరావాసానికి ఒప్పుకుంటేనే సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తానని ప్రధాని నరేంద్ర మోదీకి చెప్పాను. మొదటి కేబినెట్ సమావేశంలోనే 7 మండలాలు ఏపీలో కలుపుతూ మోదీ నిర్ణయం తీసుకున్నారు. కేంద్రం సహకారంతో పోలవరంలో 72 శాతం పనులు పూర్తి చేస్తే.. నేడు మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చింది. డయాఫ్రం వాల్ కొట్టుకుపోయింది. మళ్లీ కేంద్ర సహకారంతో పోలవరం పూర్తి చేసి నదులు అనుసంధానంతో చేసి ప్రతి ఎకరాకు నీళ్లందిస్తాం." అని చంద్రబాబు హామీ ఇచ్చారు.

చైతన్యరథం

# చంద్రబాబు 4.0



- నాలుగోసారి ముఖ్యమంత్రిగా నేడే ప్రమాణ స్వీకారం
- కేసరపల్లి ఐటీ పార్క్ వద్ద సర్వం సిద్ధం
- హాజరుకానున్న మోదీ, అమిత్ షా, కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల సీఎంలు, సినీ దిగ్గజాలు రజనీకాంత్, చిరంజీవి
- కట్టుదిట్టమైన భద్రత, పకడ్బందీగా ఏర్పాట్లు

అమరావతి: ముఖ్యమంత్రిగా నాలుగోసారి బాధ్యతలు చేపట్టబోతున్న టీడీపీ అధినేత చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. గన్నవరం సమీపంలోని కేసరపల్లి ఐటీ పార్క్ వద్ద బుధవారం ఉదయం 11.27 గంటలకు సీఎంగా చంద్రబాబు ప్రమాణం చేయనున్నారు. దీనికోసం 80 అడుగుల వెడల్పు 60 అడుగుల పొడవు ఎనిమిది అడుగుల ఎత్తుతో వేదిక సిద్ధం చేశారు. రాష్ట్రంలో కూటమి ఘన విజయానికి ప్రతీకగా ఈ కార్యక్రమం ఉంటుందని టీడీపీ వర్గాలు తెలిపాయి. ముఖ్య అతిథిగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరుకానున్నారు.

పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, భాజపా ముఖ్యనాయకులు, జనసేనాని పవన్ కల్యాణ్, రాష్ట్రంలో గెలిచిన 164 మంది కూటమి ఎమ్మెల్యేలు, 21 మంది లోక్‌సభ సభ్యులు హాజరుకానున్నారు. మెగాస్టార్ చిరంజీవి, తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్, పలువురు సినీ ప్రముఖులు కూడా తరలివస్తున్నారు. వీరందరికీ ప్రొటోకాల్ పరంగా ఎక్కడా ఇబ్బందులు ఎదురవకుండా, భద్రతాపరమైన లోపాల్లేకుండా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. సభావేదిక, సీటింగ్, భద్రత, పార్కింగ్ పై అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ప్రముఖులతోపాటుగా దాదాపు లక్ష మందికిపైగా ప్రజలు వస్తారని అంచనా వేసిన నేపథ్యంలో 80 వేల మందికి సీటింగ్ ఏర్పాట్లు చేశారు.

అదేవిధంగా మిగిలిన వారు కూడా ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి దాదాపు 8 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వీటిని రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సభా వేదిక, ప్రాంగణంలోకి ప్రవేశించే అన్ని మార్గాల్లోనూ నిఘా కెమెరాలను అమర్చారు. సీఎస్ నీరభ్‌కుమార్ ప్రసాద్ ఆధ్వర్యంలో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, కార్యక్రమ రాష్ట్ర సమన్వయ అధికారి, రాష్ట్ర రవాణా, రహదారులు భవనాల శాఖ ప్రధాన కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న, రాష్ట్ర ఉన్నతాధికారులు వీర పాండ్యన్, రాష్ట్ర హార్టికల్చర్ కమిషనర్ ఎస్ఎస్ శ్రీధర్, పోలీస్ అధికారులు, వివిధ జిల్లాల నుండి విధుల నిర్వహణకై విచ్చేసిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేశారు.

ఐదేళ్లుగా అన్ని విధాలుగా అణిచివేతకు గురై.. ఈ క్షణం కోసమే ఎదురు చూస్తున్న తెలుగు తమ్ముళ్లు, జనసైనికులు ఈ అపురూప వేడుకను తిలకించాలని వేలాదిగా కేసరపల్లి వైపు కదం తొక్కుతున్నారు. నారా చంద్రబాబు నాయుడు అనే నేను... అనే మాటలు వినేందుకు కష్టనష్టాలకు ఓర్చి, నెత్తురు చిందించిన వేలాదిమంది కార్యకర్తలు రాష్ట్రం నలుమూలల నుండి భారీగా తరలివస్తున్నారు.

అటు ప్రధాని సహా పలువురు వీవీఐపీలు, ఇటు లక్షలాదిగా తరలివస్తున్న జనాన్ని దృష్టిలో ఉంచుకుని పోలీసు అధికారులు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లు చేశారు. సభా ప్రాంగణం పరిసర ప్రాంతాల్లో సుమారు 30వరకు పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు.

విజయవాడ నగరంలో పలు చోట్ల ట్రాఫిక్ మళ్లింపులు చేపడుతున్నారు. పాసులు ఉన్న వారి వాహనాలనే సభా ప్రాంగణం వైపు వెళ్లేందుకు అనుమతిస్తామని పోలీసులు చెబుతున్నారు. నగరంలో వీఐపీలు బసచేసే హోటళ్ల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశామని విజయవాడ పోలీసు కమిషనర్ పీహెచ్ రామకృష్ణ తెలిపారు. అతిథులు సహా సభకు వచ్చినవారెవరూ ఎలాంటి ఇబ్బంది పడకుండా, అంతా సవ్యంగా సాగేలా రూపొందించిన ప్రణాళికను అధికారులు పక్కాగా అమలు చేస్తున్నారు. భారీ వేదిక నిర్మాణంతోపాటు వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా జర్మన్ హ్యాంగర్లతో భారీ షెడ్లు ఏర్పాటు చేశారు.

## ఇన్‌ఛార్జులదే బాధ్యత!

పన్నెండు ఎకరాల స్థలంలో ఏర్పాటవుతున్న సభా ప్రాంగణంలో ప్రముఖుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్యాలరీలకు అధికారులు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులు, న్యాయమూర్తులు, అఖిల భారత సర్వీసుల అధికారులు, ప్రత్యేక అతిథులు, ఆహ్వానితులు, మీడియా ప్రతినిధుల కోసం వీటిని కేటాయించారు. ఒక్కో గ్యాలరీకి ఒక జిల్లాస్థాయి అధికారిని నియమించారు. మంచినీరు, అల్పాహారం, ఇతర సౌకర్యాలను కల్పించాల్సిన బాధ్యత వీరిదే. వీవీఐపీలకు పాసుల ప్రకారం సీటింగ్ కేటాయించాల్సి ఉంటుంది. ఆయా సీట్లలో వారిని కూర్చోబెట్టే బాధ్యతను గ్యాలరీ ఇన్చార్జికే అప్పగించారు. ఇందుకోసం వివిధ జిల్లాల నుంచి సంయుక్త కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలను కేటాయించారు. కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ, సంయుక్త కలెక్టర్ గీతాంజలిశర్మ సమన్వయం చేస్తున్నారు. అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. సభా వేదికపై కూర్చొనే అతిథుల కోసం ప్రొటోకాల్ ప్రకారం ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను నియమించారు.

## భారీగా రానున్న జనం

ప్రమాణస్వీకార మహోత్సవానికి వచ్చే జనం కోసం చుట్టుపక్కల జిల్లాల్లో నియోజకవర్గానికి 4 బస్సుల చొప్పున అందుబాటులో ఉంచనున్నారు. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, గుంటూరు, తూర్పుగోదావరి తదితర జిల్లాల నుంచి ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని అంచనా. చాలావరకు కార్యకర్తలు సొంతంగా వాహనాలను సమకూర్చుకుని రావొచ్చని చెబుతున్నారు. సభకు లక్షలాదిగా జనం వస్తారన్న అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) చెప్పారు. ప్రధానమంత్రి రాకతో కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది కాబట్టి కార్యకర్తలు ఉదయం 10 గంటలకల్లా సభా ప్రాంగణంలోకి రావాలని సూచిస్తున్నారు.

ఈ కార్యక్రమం కోసం కోల్‌కతా–చెన్నై జాతీయ రహదారిపై బుధవారం పలుచోట్ల ట్రాఫిక్ మళ్లింపులు చేపడుతున్నారు. విజయవాడ నగరంలో కూడా ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నారు. ప్రధానమంత్రి, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు.. గన్నవరం విమానాశ్రయం నుండి ప్రధాన సభ వేదిక వద్దకు రాకపోకలు సాగించేందుకు, గవర్నర్ కాన్వాయికి ఎలాంటి అడ్డంకులు లేకుండా పకడ్బందీగా ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేశారు. ప్రధాన వేదికతో పాటు వివిధ ప్రయాణ మార్గాలు, పార్కింగ్ ప్రదేశాలు, అన్నిచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేశారు. వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన మందులు, అంబులెన్స్ సిద్ధంగా ఉంచారు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం లైవ్ టెలికాస్ట్ లింక్ ద్వారా అన్ని జిల్లాలలో ప్రజలు వీక్షించేందుకు వీలుగా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాట్లు చేశారు.

## హాజరు కానున్న ప్రముఖులు

అమరావతి: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు బుధవారం ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా పలువురు ప్రముఖులు హాజరవనున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు పలువురు కేంద్రమంత్రులు, ప్రముఖులు హాజరుకానున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర వైద్య–ఆరోగ్య శాఖా మంత్రి జేపీ నడ్డా, కేంద్ర సూక్ష్మ మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి జితన్ రామ్ మాంఝి, కేంద్ర ఆహార ఉత్పత్తుల శాఖా మంత్రి చిరాగ్ పాశ్వాన్, కేంద్ర రోడ్డు రవాణా, ప్రధాన రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వీ.రమణ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, కేంద్ర స్కిల్ డెవలెప్మెంట్ శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి, కేంద్ర సహాయ వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి అనుప్రియా పాటిల్, సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్ సహాయ మంత్రి రామ్ దాస్ అథవాలే, రాజ్యసభ ఎంపీ ప్రఫుల్ పాటేల్, మాజీ గవర్నర్ తమిళసై, తమిళనాడు మాజీ సీఎం పన్నీర్ సెల్వం పాల్గొననున్నారు. వీరితో పాటు పలువురు సినీ ప్రముఖులు కూడా పాల్గొననున్నారు. మెగాస్టార్ చిరంజీవి, సూపర్ స్టార్ రజనీకాంత్ ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొననున్నారు.





# ఇదీ.. కొలువుదీరనున్న కేబినెట్


నారా చంద్రబాబు నాయుడు


కొణిదెల పవన్ కళ్యాణ్


నారా లోకేష్


కింజరాపు అచ్చెన్నాయుడు


కొల్లు రవీంద్ర


నాదెండ్ల మనోహర్


పి.నారాయణ


వంగలపూడి అనిత


సత్యకుమార్ యాదవ్


నిమ్మల రామానాయుడు


కొలుసు పార్థసారథి


అనగాని సత్యప్రసాద్


పయ్యావుల కేశవ్


ఆనం రామనారాయణరెడ్డి


ఎన్.ఎమ్.డి.ఫరూక్


బీసీ జనార్దన్ రెడ్డి


గుమ్మడి సంధ్యారాణి


కందుల దుర్గేష్


గొట్టిపాటి రవి


డోలా బాలవీరాంజనేయస్వామి


మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి


కొండపల్లి శ్రీనివాస్


వాసంశెట్టి సుభాష్


ఎస్.సవిత


టీజీ భరత్

## చంద్రబాబు ఫోన్‌కు అందుబాటులోకి రాని జగన్

అమరావతి: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాలుగోసారి టీడీపీ అధినేత చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్‌ను కూడా ఈ కార్యక్రమానికి ఆహ్వానించాలని చంద్రబాబు నిర్ణయించారు. దీంతో ఆయన మంగళవారం సాయంత్రం జగన్‌తో ఫోన్‌లో మాట్లాడి స్వయంగా ఆహ్వానించేందుకు ప్రయత్నించారు. కానీ, జగన్ అందుబాటులోకి రాలేదు.

## ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించండి

***గవర్నర్‌ను కలిసిన ఎన్డీఏ నేతలు***

విజయవాడ (చైతన్యరథం): రాష్ట్రంలో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలంటూ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఎన్డీఏ నేతలు కోరారు. శాసనసభ్యుల మద్దతు తీర్మానాన్ని అందచేశారు. అంతకుముందు కూటమి ఎమ్మెల్యేలు సమావేశమై ఎన్డీఏ శాసనసభా పక్షనేతగా టీడీపీ అధినేత చంద్రబాబు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్.. గవర్నర్‌ను కలిసి చంద్రబాబును శాసనసభా పక్షనేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న తీర్మానాన్ని అందజేసి, ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరారు. చంద్రబాబు బుధవారం ఉదయం 11.27 గంటలకు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

## 17 నుంచి అసెంబ్లీ సమావేశాలు

అమరావతి: ఈనెల 17 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. మొత్తం నాలుగురోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరిగే అవకాశం ఉంది. మొదటిరోజు ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం ఉంటుంది. రెండో రోజు స్పీకర్ ఎన్నిక ఉంటుంది. ఎన్డీఏ కూటమి ఎన్నికల హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ చట్టం ఉపసంహరణ బిల్లు ను ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే పెట్టి ఆమోదించే అవకాశం ఉంది.

చైతన్యరథం

పుణ్యభూమి నా దేశం నమో నమామి

## సంపాదకీయం

### విజయీభవ!

[illegible]

## మాటకు మాట



జగన్‌కు షాకిచ్చిన.. వైసీపీ తిండా ఎగరేసేదాకా ఇలాగే కష్టపడతాం: మాజీ ఎమ్మెల్యే గండికోట



[illegible]

# పీఠాన్నధిష్టిస్తున్న..

# పడిలేచిన కెరటం!

పడిలేచే కడలి తరంగంలాంటి చంద్రబాబుని ఇతర రాజకీయ నాయకులకు భిన్నంగా చూపేది -ఆయనలోని పెన్ను చూపని ధీరత్వమే. సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నా, నిలదొక్కుకున్న నేత చంద్రబాబు. రాజకీయాల్లో ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఆత్మవిశ్వాసంతో నిలబడేవారే ప్రజాజీవితంలో విజయం సాధిస్తారని మరోసారి రుజువైంది.

నీరుకొండ ప్రసాద్

[illegible] 164 [illegible] 151 [illegible] 11 [illegible]

[illegible] 2024 [illegible] 45.60 [illegible] 39.37 [illegible] 25 [illegible] 21 [illegible] 4 [illegible]

[illegible] 14 [illegible] 15 [illegible]

[illegible] 2019 [illegible]

తెలుగుదేశం కూటమి సాధించింది అపూర్వమైన ఘన విజయమే. రాజకీయ విశ్లేషకుల అంచనాలను మించిపోయి కూటమి 164 సీట్లు గెలుచుకుంది. దాదాపు ఐదేళ్లలో గత ఎన్నికల్లో 151 సీట్లు ఒక్క వైసీపీనే గెలుచుకుంది. ఐదేళ్ల పూర్తయ్యేసరికి అందులో మిగిలినవి కేవలం 11 సీట్లకు పరిమితమైంది. మనం ప్రజలకు ఏం చేస్తాం అనేది మాత్రమే సరిపోదు. ఎలా పరిపాలించాం అన్నది ముఖ్యం. వారితో పదవీ కాలమంతా ఎలా మెలిగాం అన్నది కూడా ప్రధానమని ఫలితాలు చెప్పాయి. ప్రజాస్వామ్యంలో ప్రజల మనోభావాలను జగన్ విస్మరించారు. జగన్ నిరంకుశ పాలనను అసహ్యించుకున్నారు కనుకనే ప్రజలు కూటమికి ఈ గెలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభంజనాన్ని సృష్టించింది.

# చంద్రబాబు అనుభవం, శక్తి రాష్ట్రానికి అవసరం

## సమష్టిగా ప్రభుత్వాన్ని నడిపిద్దామని కూటమి ఎమ్మెల్యేలకు పవన్ పిలుపు



విజయవాడ: కూటమి ఎమ్మెల్యేలు సమష్టిగా ప్రభుత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పిలుపు ఇచ్చారు. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో విపత్కర పరిస్థితులు తలెత్తాయని పవన్‌కళ్యాణ్ అన్నారు. ఎన్నికల్లో తెదేపా, జనసేన, భాజపా కూటమి కలిసి కట్టుగా పోరాడి అద్భుత విజయాన్ని సొంతం చేసుకుందని చెప్పారు. విజయవాడలోని ఏ కన్వెన్షన్‌లో మంగళవారం జరిగిన ఎన్డీఏ ఎమ్మెల్యేల సమావేశంలో కూటమి శాసన సభాపక్ష నేతగా చంద్రబాబు పేరును ప్రతిపాదించిన అనంతరం పవన్ మాట్లాడారు. తెదేపా, జనసేన, భాజపా ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు. అందరం కలిసికట్టుగా పోరాడి అద్భుతమైన మెజారిటీలతో గెలిచాం. 164 శాసనసభ స్థానాలు, 21 ఎంపీలను ఎన్డీయే కూటమి దక్కించుకుంది. అద్భుతమైన విజయం ఇది. కూటమి అంటే ఎలా ఉండాలో రాష్ట్ర ప్రజలు కలిసికట్టుగా చూపించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వం అని గతంలో ఇప్పటం సభలో చెప్పాను.. అదే మాటపై నిలబడ్డాను. ఒడుదొడుకులు ఎదుర్కొన్నాం.. తగ్గాం.. ప్రజల్లో నమ్మకాన్ని పెంచి అద్భుతమైన మెజారిటీతో ప్రభుత్వాన్ని స్థాపించబోతున్నాం. కక్ష సాధింపులకు, వ్యక్తిగత దూషణలకు ఇది సమయం కాదు. మనందరం సమష్టిగా ప్రభుత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలి. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలి. సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం, శాంతి భద్రతల విషయంలో బలంగా నిలబడతామని చెప్పాం. ఉమ్మడి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను బాధ్యతగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. ఇలాంటి సమయంలో సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకుడు కావాలి. నాలుగు దశాబ్దాల అనుభవం, అభివృద్ధిపై అపారమైన అవగాహన, పెట్టుబడులను తీసుకొచ్చే సమర్థత, ప్రతిభ, విదేశాల అధ్యక్షులను తెలుగు రాష్ట్రాల వైపు దృష్టి మళ్లించే శక్తి ఉన్న చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి చాలా అవసరం. చంద్రబాబుకు మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు చెబుతున్నా.. అద్భుతమైన పాలన అందివ్వాలని కోరుకుంటున్నా" అని చెప్పారు. ఈ సందర్భంగా పవన్‌ను చంద్రబాబు ఆలింగనం చేసుకుని ధన్యవాదాలు తెలిపారు.



గన్నవరం విమానాశ్రయంలో మంగళవారం రాత్రి కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌లకు స్వాగతం పలికిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్.





ఉండవల్లి నివాసంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుని మర్యాదపూర్వకంగా కలిసిన కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ.



ఉండవల్లి నివాసంలో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను సత్కరించి అభినందనలు తెలిపిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్.

## చంద్రబాబుతో అమిత్ షా భేటీ



అమరావతి: కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం రాత్రి ఉండవల్లి నివాసంలో టీడీపీ అధినేత చంద్రబాబుతో భేటీ అయ్యారు. అమిత్‌షాతో పాటు బీజేపీ అగ్రనేతలు జేపీ నడ్డా, ఎంపీ దగ్గుపాటి పురంధరేశ్వరి, సిద్ధార్థనాథ్ సింగ్, బీఎల్ సంతోష్ కూడా చంద్రబాబు నివాసానికి వచ్చారు. చంద్రబాబు వీరికి సాదర స్వాగంత పలికారు. నేతలకు తన నివాసంలో విందు ఏర్పాటు చేశారు. విందు తర్వాత కీలక అంశాలపై నేతలు చర్చలు జరిపారు. చంద్రబాబు ప్రమాణస్వీకారానికి ఒక రోజు ముందే అమిత్‌షా రావడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కేబినెట్ కూర్పు, బీజేపీలో ఎవరికి అవకాశం ఇవ్వాలన్న దానిపై చంద్రబాబుతో అమిత్ షా చర్చించారు. బీజేపీ మంత్రుల విషయంలో స్పష్టత వచ్చాక కేబినెట్‌పై కూడా స్పష్టత వస్తుంది. అమిత్‌షాతో భేటీ తర్వాతే మంత్రులుగా ఛాన్స్ దక్కించుకున్న వారికి చంద్రబాబు ఫోన్ చేయనున్నట్లు తెలిసింది. చంద్రబాబుతో భేటీ ముగిశాక రాత్రికి విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో అమిత్‌షా బస చేస్తారు.









## బాబును చూడాలి.. కాన్వాయ్ వెంట మహిళ పరుగులు
## కారు ఆపి మాట్లాడిన చంద్రబాబు



విజయవాడ (చైతన్యరథం): విజయవాడలో కూటమి ఎమ్మెల్యేల సమావేశానికి వచ్చిన చంద్రబాబు నాయుడుని చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున రోడ్ల మీదకు వచ్చారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు దారి పొడవునా స్వాగతం పలికారు. ఏ కన్వెన్షన్‌లో కూటమి సమావేశం అనంతరం ఉండవల్లి ప్రయాణమైన చంద్రబాబును చూసేందుకు మదన పల్లికి చెందిన ఓ మహిళ కాన్వాయ్ వెంట పరుగులుపెట్టింది. ఆ మహిళను కారులోంచి చూసిన చంద్రబాబు వెంటనే కాన్వాయ్‌ను ఆపి... ఆ మహిళను దగ్గరకు పిలిచి మాట్లాడారు. తనది మదనపల్లి అని తన పేరు నందిని అని చెప్పిన ఆమహిళ చంద్రబాబుపై అభిమానంతో చూడడానికి వచ్చాను అని చెప్పింది. తనను చూసి ఉద్విగ్నతకు లోనైన ఆ మహిళతో చంద్రబాబు మాట్లాడా రు. సెక్యూరిటీని వారించి ఆమె వివరాలు తెలుసుకున్నారు. మా కష్టం ఫలించి....మా కోరిక మేరకు మీరు సీఎం అయ్యారు సార్...ఒక్కసారి మీ కాళ్లు మొక్కుతాను అంటూ ఆమహిళ అనగా... చంద్రబాబు సున్నితంగా వారించారు. ఆమెను ఆప్యాయంగా పలకరించి ఆమెతో ఫోటో దిగారు. తనకు జ్వరం ఉన్నా చూడడాలని వచ్చాను అని నందిని చెప్పగా... ముందు ఆసుపత్రికి వెళ్లు అంటూ సూచించారు. ఆమె ఎక్కడఉంటారో తెలుసుకుని.... అవసరమైన వైద్యం సాయం చేయాలని పార్టీ నేతలకు చంద్రబాబునాయుడు సూచించారు.



చైతన్యరథం

# గవర్నర్‌తో చంద్రబాబు భేటీ









విజయవాడ: ఏపీ సీఎంగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడి ప్రమాణస్వీకారం చేయడానికి జరగాల్సిన ప్రక్రియ పూర్తయింది. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో చంద్రబాబు మంగళవారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో భేటీ అయ్యారు. తనకు మద్దతు ఇస్తున్న 163 మంది ఎమ్మెల్యేల జాబితాను ఈ సందర్భంగా గవర్నర్‌కు చంద్రబాబు అందజేశారు. అనంతరం రాష్ట్రంలో నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని చంద్రబాబును గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆహ్వానించారు. భేటీ అనంతరం రాజ్‌భవన్ నుంచి చంద్రబాబు ఉండవల్లి నివాసానికి బయలుదేరి వెళ్లారు. కాగా బుధవారం ఉదయం 11.27 గంటలకు చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయన చేత గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించనున్నారు. అందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా బరిలో నిలిచి 175 అసెంబ్లీ స్థానాలకు గాను 164 స్థానాల్లో విజయం సాధించాయి.

## చెమర్చిన కళ్లతో బాబు గాఢాలింగనం!



అమరావతి (చైతన్య రథం):ఎన్డీయే శాసన సభాపక్ష సమావేశంలో తెలుగుదేశం, జనసేన అగ్రనేతలిద్దరూ ఉద్వేగానికి లోనయ్యారు. కూటమి శాసన సభా పక్ష నేతగా చంద్రబాబును జనసేన ప్రతిపాదించే సమయంలో మంద్ర స్వరంతో మాట్లాడిన పవన్ కళ్యాణ్-కూటమి అప్రతిహత విజయం వెనుక అకుంఠిత దీక్షను మూడు ముక్కల్లో క్లుప్తంగా చెప్తూ ఉద్వేగానికి లోనయ్యారు. 'ఉమ్మడి మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను బాధ్యతగా ముందుకు తీసుకెళ్లాల్సిన సమయమిది. అందుకు సుదీర్ఘ అనుభవమున్న నాయకుడు అవసరం చాలావుంది. నాలుగు దశాబ్దాల అనుభవం, అభివృద్ధిపై అపారమైన అవగాహన, పెట్టుబడులను తీసుకొచ్చే సమర్థత, ప్రతిభ, విదేశాల అధ్యక్షులను తెలుగు రాష్ట్రాలవైపు దృష్టి మళ్లించే శక్తివున్న చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి అవసరం. అందుకే -కూటమి శాసన సభాపక్షాన్ని ముందుకునడి పేందుకు ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించాల్సిందిగా జనసేన తరపున చంద్రబాబుగారి పేరును ప్రతిపాదిస్తున్నాను' అనడంలో అప్పటి వరకూ గంభీరంగావున్న సభమొత్తం కరతాళ ధ్వనులతో ఆనందం వ్యక్తం చేసింది. కృతజ్ఞతగా తన స్థానంనుంచి లేచి వచ్చిన చంద్రబాబు చెమర్చిన కళ్లతో జనసేనాధినేతను గాఢాలింగనం చేసుకున్నారు. చంద్రబాబు చేతులు గట్టిగా పట్టుకునే పవన్ కళ్యాణ్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'ఇప్పుడు నేను చెప్పే మాటలు ఈయనను పక్కన పెట్టుకునే చెప్పాలి. ఆయన నలిగిపోయారు. నలిగిపోయారు (గతాన్ని గుర్తు చేసుకుంటో, బాధను పంటి బిగువున నొక్కిపెట్టి). జైల్లో చూశాను. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి పడిన బాధనూ చూశాను. మంచి రోజులు వస్తాయి.. కన్నీళ్లు పెట్టొద్దని చెప్పాను. ఇప్పుడు ఆ రోజులు వచ్చాయి.చంద్రబాబుకు మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు చెబుతున్నా.. మీరు, అద్భుతమైన పాలన అందివ్వాలి సర్. మీకు శుభాకాంక్షలు' అన్నారు. ఆ ఉద్విగ్న క్షణాల్లో చంద్రబాబు కళ్లలో ఆనంద బాష్పాలు సన్నటి తెరగా తొణికిసలాడటం.. ఒకరిపట్ల ఒకరికున్న బాంధవ్యానికి ప్రతీకే అయ్యింది.

### ప్రధాని ఎంతో నమ్మకంతో పౌర విమానయాన శాఖ అప్పగించారు

## న్యాయం చేసేందుకు కృషి చేస్తా: రామ్మోహన్‌నాయుడు



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ ఎంతో నమ్మకంతో పౌరవిమానయాన శాఖను తనకు అప్పగించారని... ఆయనకు ఇది ఎంతో ప్రతిష్ఠాత్మక మంత్రిత్వశాఖ అని తనతో చెప్పారని కేంద్రమంత్రి, టీడీపీ ఎంపీ రామ్మోహన్ నాయుడు అన్నారు. మంగళవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... భారతదేశ, తన వ్యక్తిగత ప్రతిష్టను సైతం నీ చేతిలో పెడుతున్నానని ప్రధాని మోదీ తనతో అన్నారని గుర్తు చేసుకున్నారు. దేశ ప్రజలకు సేవలు అందించాలని సూచించారన్నారు. సోమవారం కేబినెట్ భేటీ తర్వాత ప్రధాని మోదీ తనతో మాట్లాడినట్లు చెప్పారు. ఇది తనకు చాలా పెద్ద బాధ్యత అని... వయస్సుకు మించినదని అన్నారు. ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల సహకారం తీసుకొని ముందుకు సాగుతానని చెప్పారు. గతంలో పౌరవిమానయాన మంత్రిగా పని చేసిన జ్యోతిరాదిత్య సింధియాను కూడా కలిసి సలహాలు, సూచనలు తీసుకుంటానన్నారు. త్వరలో బాధ్యతలు చేపట్టి.. పౌరవిమానయానానికి సంబంధించి దేశానికి, రాష్ట్రానికి ఒక విజన్ తయారు చేసి ముందుకు సాగుతామన్నారు. తిరుపతి, విజయవాడ సహా ఏపీలో ఉన్న విమానాశ్రయాలలో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తామన్నారు. పౌరవిమానయాన శాఖలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు వచ్చేలా పని చేస్తానని తెలిపారు. తనకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆదర్శమని... ఆయన రోడ్స్ అండ్ ట్రాన్స్‌పోర్ట్‌లో అద్భుతాలు సృష్టించారని ప్రశంసించారు. గడ్కరీ అంటే రోడ్లు... రోడ్లు అంటే గడ్కరీ అన్న విధంగా ఇప్పుడు తయారయిందన్నారు. అందుకే మరోసారి ఆయనకు అదే శాఖను అప్పగించారని గుర్తుచేశారు. అలాగే, రేపు... భవిష్యత్తులో పౌరవిమానయాన శాఖకు సంబంధించిన చర్చ జరిగితే రామ్మోహన్‌నాయుడు ఉన్నప్పుడు ఇలా జరిగింది అనే మార్క్ తీసుకువస్తానని ధీమా వ్యక్తం చేశారు.

తనను యంగెస్ట్ మినిస్టర్ అనడం చాలా సంతోషంగా ఉందన్నారు. అయితే ఇది అదనపు బాధ్యత అవుతుందని పేర్కొన్నారు. ఎందుకంటే అందరి దృష్టి తనపైనే ఉంటుందన్నారు. అందుకు అనుగుణంగా ఏవియేషన్ మినిస్ట్రీలో తన మార్క్ ఉండాలనేది తన ఉద్దేశ్యమన్నారు.అన్ని మంత్రిత్వ శాఖలకు సంబంధించిన వారితో తనకు అనుబంధం ఉందని... అలాగే రాష్ట్ర సమస్యలు తనకు తెలుసునని రామ్మోహన్ నాయుడు చెప్పారు.అందుకే ఇతర మంత్రులతో మాట్లాడి రాష్ట్రానికి సంబంధించిన ప్రతి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వంలో ఉన్నాం కాబట్టి మనకు కావాల్సినవి తెచ్చుకునే వెసులుబాటు ఉందన్నారు.

### తెలంగాణకు న్యాయం చేస్తా

తెలంగాణ ప్రజలను దృష్టిలో పెట్టుకొని తాను ఆ ప్రాంతానికి న్యాయం చేసే ప్రయత్నం చేస్తానని కేంద్రమంత్రి, టీడీపీ శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్‌నాయుడు అన్నారు. తెలంగాణ ఎంపీలు,కేంద్ర మంత్రులు, తెలంగాణ ముఖ్యమంత్రి... ఇలా ఎవరి నుంచి తనకు విజ్ఞప్తులు వచ్చినా మరో ఆలోచన లేకుండా ఆప్రాంతానికి న్యాయం చేసే ప్రయత్నం చేస్తానని హామీఇచ్చారు. తన సహకారంతో తెలంగాణలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారని... ఇది తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఇరు తెలుగు రాష్ట్రాల మధ్య ఈ అనుబంధంఎప్పుడూ కొనసాగాలన్నారు.

## గన్నవరం విమానాశ్రయ పరిసరాల్లో నేడు ట్రాఫిక్ ఆంక్షలు

*- ప్రయాణికులు ఉదయం 9.30 లోపు చేరుకోవాలి*

*- విమాన సర్వీసులన్నీ యథాతథంగా నడుస్తాయి*

విజయవాడ: బుధవారం ఉదయం 11.27 గంటలకు ఏపీ సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయనున్న విషయం తెలిసిందే. ప్రమాణస్వీకారోత్సవానికి ప్రధాని మోదీ, హోమ్ మంత్రి అమిత్ షాతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల సీఎంలు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో గన్నవరం విమానాశ్రయం పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ట్రాఫిక్ ఆంక్షల దృష్ట్యా విమాన ప్రయాణికులకు ప్రత్యేక సూచనలు చేశారు. ఈ క్రమంలో వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన విమాన ప్రయాణికులు ఉదయం 9.30 గంటల లోపే విమానాశ్రయానికి చేరుకోవాలని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ సూచించారు. బుధవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. విమాన సర్వీసులన్నీ యథాతథంగా నడుస్తాయని తెలిపారు.

## చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి విదేశీ ప్రతినిధులు

విజయవాడ: రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి పలువురు విదేశీ ప్రతినిధులు హాజరవుతున్నారు. రాజధాని అమరావతి అభివృద్ధిలో భాగస్వాములయేందుకు పలు విదేశీ సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో పలువురు విదేశీ ప్రముఖులు చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరవుతున్నారు. కొరియా కాన్సులేట్ జనరల్, ఇతర ప్రతినిధులు, జపాన్, సింగపూర్, దక్షిణకొరియా, నెదర్లాండ్స్ కాన్సులేట్ జనరల్స్ ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు. విదేశీ రాయబార కార్యాలయ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఆహ్వానం పంపించింది.

# అదీ.. లోకేష్ స్టయిల్!

- తాత పట్టుదల, తండ్రి ముందుచూపుల మేలు కలయిక
- నిరంతర శ్రమతో పసుపు జెండాను సగర్వంగా నిలిపిన యువనేత
- లోతైన అధ్యయనం తరువాతే.. ఏ హామీలైనా
- రాష్ట్రాన్ని ఆకర్షించిన మంగళగిరి మోడల్..?





**లోకేష్‌కు ఓ స్టయిలుంది. అదే – అతన్ని జనం మనిషిని చేసింది. ప్రజలకైనా.. పార్టీ పరివారానికైనా కష్టమొచ్చిందంటే – అరక్షణం ఆలోచించకుండా రంగంలోకిదిగే తాత తత్వమతనిది. ప్రజా సంక్షేమం కోసం పదేళ్ల ముందుకు ఆలోచించి – ప్రణాళికలు సిద్ధం చేయగల తండ్రి ముందు చూపతనిది. పార్టీ అంతర్గత సమావేశాల్లో సాధారణ కార్యకర్త మాదిరి శ్రేణులమధ్యే కూర్చుని – సీనియర్లను అన్నా అని సంభోదిస్తూ.. అధికార భేషజాలకు ఆమడ దూరముండే ఔదార్యం.. ఎదిగినా ఒదిగి ఉండాలని చెప్పిన తల్లినుంచి పుణికిపుచ్చుకున్నది. విలక్షణ వ్యక్తిత్వాల సమ్మిళితమే లోకేష్‌ను జన నేత చేసింది. జనం మనిషిగా తీర్చిదిద్దింది. నియోజకవర్గ ప్రజల్లోనే కాదు, నవ్యాంధ్ర కుటుంబాల్లోనే – లోకేష్ పేరు వినిపించగానే 'మనింటి కుర్రాదన్న' భావన కలగదానికి అదే కారణమైంది. మోస్ట్ అట్రాక్టివ్, మోటివేషనల్, పవర్‌ఫుల్ పొలిటికల్ క్యారెక్టర్ –అంటూ లోకేష్‌ని చూడగానే కుర్రకారు ఉర్రూతలూగే స్టయిల్‌ని క్రియేట్ చేసిందీ అదే!**

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అరాచకపాలనను కూకటివేళ్లతో పెకలించి, తెలుగుదేశం విజయంలో కీలకపాత్ర పోషించిన యువనేత నారా లోకేష్ వినూత్న పంథాతో పసుపు జెండాను రెపరెపలాడించి యువతరానికి ఆదర్శంగా నిలిచారు. తాత ఎన్టీఆర్‌లోని పట్టుదల, తండ్రి చంద్రబాబునుంచి పుణికిపుచ్చుకున్న విజన్ లోకేష్‌ను సమర్ధ రాజకీయ వేత్తగా నిలిపాయి. పార్టీ కేడర్‌తోపాటు ప్రజలకు ఏ కష్టమొచ్చినా అరక్షణం ఆలోచించకుండా స్పందించే తత్వంతో యువనేత లోకేష్ అసలు సిసలైన ప్రజానేతగా తయారయ్యారు. అధికారపార్టీ అకృత్యాలు, అన్యాయాలను ప్రజాక్షేత్రం లో ఎండగట్టడంలో లోకేష్, ఎన్టీ ఆర్‌ను తలపించారు. 2021 ఆగస్టు 15, 75వ స్వాతంత్ర్య దినోత్సవాన గుంటూరులో బిటెక్ విద్యార్థిని దారుణ హత్యకు గురైంది. మరుసటి రోజు రమ్య కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పేందుకు యువనేత నారా లోకేష్ గుంటూరు వెళ్లగా పోలీసులు అరెస్టు చేసి, ప్రత్తిపాడు తరలించారు. లోకేష్ తొలిసారి అరెస్టయి పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన సందర్భమదే. జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే పొన్నపు శివారెడ్డి 7 ఆగస్టు 1993లో హైదరాబాద్‌లో ఓ బాంబు దాడిలో హత్యకు గురయ్యారు. ఆ సందర్భంలో తీవ్ర ఆగ్రహోదగ్రుడైన ఎన్టీఆర్, శివారెడ్డి శవాన్ని భుజాన వేసుకుని నేరుగా రాజ్‌భవన్ వద్దకువెళ్లి రోడ్డుపై బైఠాయించిన విషయం పాతతరం రాజకీయ నాయకులకు గుర్తుండే ఉంటుంది. అన్యాయం, అరాచకం రాజ్య మేలుతున్న ప్పుడు కష్టాల్లోవున్న ప్రజలు, పార్టీ కేడర్ కోసం ఎందాకైనా వెళ్లే తెగువను అన్న ఎన్టీఆర్ నుంచి యువనేత లోకేష్ పుణికిపుచ్చుకున్నారు. ఓర్పు, సహనం విషయంలో యువనేత లోకేష్‌కు తల్లి భువనేశ్వరి ఆదర్శం.

యువగళం పాదయాత్ర సందర్భంగా వేలాది మహిళలు తోబుట్టువుగా భావించి యువనేత లోకేష్‌కు తమ కష్టాలు చెప్పుకునే వారు. ఏమాత్రం విసుగు చెందకుండా ప్రతి సమస్యను ఓపిగ్గా ఆలకిస్తూ నేనున్నానంటూ వారికి భరోసా ఇచ్చి ముందుకు కదిలేవారు లోకేష్. పార్టీ అంతర్గత సమావేశాల సమయంలో సాధారణ కార్యకర్త మాదిరిగా కార్యకర్తల మధ్యే కూర్చుని వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం, సీనియర్లను అన్నా అని సంభోదిస్తూ ఏమాత్రం భేషజానికి పోకుండా వారి సలహాలు, సూచనలు తీసుకోవడం యువనేత లోకేష్ అరుదైన వ్యక్తిత్వానికి నిదర్శనం. ఈ విలక్షణ వ్యక్తిత్వమే లోకేష్‌ను తిరుగులేని ప్రజానేతగా తీర్చిదిద్దింది.

## రాష్ట్రాన్ని ఆకర్షించిన మంగళగిరి మోడల్

తాను ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరిలో యువనేత లోకేష్ చేపట్టిన కార్యక్రమాలు యావత్ రాష్ట్రాన్ని ఆకర్షించాయి. జగన్, చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్ వంటివారు నివాసముండే మంగళగిరి నియోజకవర్గంలో యువనేత చేపట్టిన కార్యక్రమాలు అందరిలోనూ ఆసక్తి పెంచాయి. అధికారంలో లేకపోయినా ఐదేళ్లపాటు నిత్యం ప్రజల్లో ఉంటూ కోట్లాది రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి మంగళగిరి ప్రజల మనసులు గెలుచుకున్నారు. సొంత నిధులతో 29 సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి శభాష్ అనిపించుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ట్యాంకర్లనుంచి పేదల ఆకలితీర్చే అన్నా క్యాంటీన్ల వరకు ప్రభుత్వంతో సంబంధం లేకుండా అమలుచేశారు. నియోజకవర్గంలో చేనేతలను ఆదుకుని మంగళగిరి చేనేతకు గతవైభవం చేకూర్చేందుకు వీవర్స్ శాలను ఏర్పాటు చేయడమేగాక.. టాటా సంస్థతో ఒప్పందం చేసుకుని మార్కెటింగ్ సౌకర్యం కల్పించారు. నియోజకవర్గవ్యాప్తంగా గ్రామ కూడళ్లలో సిమెంటు బల్లలు, పేదల స్వయం ఉపాధికి తోపుడుబళ్లు, మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాలతో పాటు కుట్టుమిషన్లు, ఎన్టీఆర్ ఆరోగ్య రథాల ద్వారా వైద్యసేవలు అందించారు. పలు గ్రామాల్లో సొంత నిధులతో రోడ్లు కూడా నిర్మించారు. పేదల ఇళ్లలో వివాహం జరిగితే దంపతులకు పెండ్లి కానుకలతోపాటు, కుటుంబసభ్యులు చనిపోతే మట్టిఖర్చులకూ సాయం అందించి పెద్దకొడుకులా అండగా నిలిచారు. నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టమొచ్చినా నేరుగా తానేవెళ్లి వారికి అండగా నిలిచారు. జగన్ ప్రభుత్వం రోడ్డువిస్తరణ పేరుతో ఇళ్లు కూల్చివేస్తే బాధితులకు అండగా నిలబడి పోరాడారు. యువగళానికి ముందే నియోజకవర్గ వ్యాప్తంగా పాదయాత్ర చేపట్టి సమస్యలను పూర్తిగా ఆకళింపు చేసుకున్నారు. పేదరికంలేని మంగళగిరే లక్ష్యమంటూ ప్రజల్లోకి వెళ్లి తమ విజన్‌ను ప్రజలకు తెలియజెప్పడంలో సక్సెస్ అయ్యారు. నిరంతరం ప్రజలతో మమేకమవుతూ పట్టుదల, మొక్కవోని దీక్షతో ఇంటా, బయటా పసుపుజెండాను రెపరెపలాడేలా చేసి నవతరానికి రోల్‌మోడల్‌గా నిలిచారు యువనేత నారా లోకేష్.



## లోతైన అధ్యయనం తర్వాతే హామీలు!

నిత్యం తమ దృష్టికొచ్చే సమస్యలపై లోతైన అధ్యయనం చేశాకే వాటిపై లోకేష్ హామీ ఇస్తారు. సాంప్రదాయ రాజకీయ నాయకుల మాదిరి ఎడా పెడా హామీలిచ్చేసి తర్వాత ముఖం చాటేయనని, చేయ గలిగింది మాత్రమే చెబుతానంటూ బహి రంగంగానే అంటుంటారు. ఈ విషయంలో పార్టీ అధినేత చంద్రబాబు విజన్‌ను లోకేష్ ఆదర్శంగా తీసుకుంటారు. ఉదాహరణకు రాబోయే ఐదేళ్లలో యువతకు 20లక్షల ఉద్యోగ కల్పన హామీ. ఎన్నికల సమయంలో రాష్ట్రవ్యాప్తంగా యువగళం పేరిట యువతతో నిర్వహించిన ముఖాముఖి సమావేశాల్లో ఉద్యోగ కల్పన విషయంలో పలువురు యువతీ యువకులు తమ సందేహాలను వ్యక్తంచేశారు. ఐదేళ్ల జగన్మోహన్‌రెడ్డి అరాచకపాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో ఏవిధంగా లక్షలాది ఉద్యోగాలు కల్పిస్తారని ప్రశ్నించేవారు. కనీసం గూడు కూడా లేని విభజిత ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఏవిధంగా అభివృద్ధి చేసింది కియా, ఫ్యాక్స్ కాన్, సెల్‌కాన్‌వంటి పరిశ్రమలను ఉదహరించారు. అత్యంత గడ్డుపరిస్థితులున్న సమయంలోనే తాము అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో పోటీపడి ఆనాడు ఆరు లక్షల ఉద్యోగాలు కల్పించామని, ఈ ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి వచ్చాక చంద్రబాబు బ్రాండ్‌తో రాష్ట్రానికి పరిశ్రమలు వరదలా వస్తాయని, వాటిద్వారా ఉద్యోగాల పంట పండుతుందని వివరించారు. పరిశ్రమలు, పెట్టుబడుల రాకతో యువతకు ఉద్యోగాలు వస్తాయని, తద్వారా రాష్ట్ర ఆదాయం రెండింతలు పెరుగుతుందని చెబుతూ తద్వారా మెరుగైన సంక్షేమాన్నీ అందించగలమని లోకేష్ గణాంకాలతో వివరించిన తీరు యువతీ యువకుల్లో నమ్మకాన్ని కలిగించింది. గ్రూప్–1 విద్యార్థులకు మూల్యాంకన విషయంలో అన్యాయం జరిగినపుడు లోకేష్‌వారికి అండగా నిలబడ్డారు. చివరకు ఆ పరీక్ష రద్దయి ప్రతిభగల విద్యార్థులకు ఊరట లభించింది. ఏదైనా సమస్యను టేకప్ చేస్తే పరిష్కారమయ్యే వరకు వదలబోరన్న గుడ్‌విల్‌ను లోకేష్ సొంతం చేసుకున్నారు. ఈ నమ్మకమే ఎన్నికల్లో ఓట్లవర్షం కురిసేలా చేసి, తెలుగుదేశం పార్టీని విజయతీరాలకు చేర్చింది.

# యువగళం అనుభవాలే కూటమి మ్యానిఫెస్టోకు పునాది

## – ప్రజల కష్టాలు, కన్నీళ్లు నేరుగా చూశాకే రూపకల్పన

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో ఐదు కోట్లమంది ప్రజల ఆశలు, ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ ప్రజాచైతన్యమే లక్ష్యంగా 226 రోజులపాటు సాగిన యువగళం పాదయాత్రలో యువనేత లోకేష్‌కు ఎదురైన అనుభవాలు, ప్రజలు చెప్పుకున్న కష్టాలు, కన్నీళ్లే ప్రాతిపదికగా కూటమి మ్యానిఫెస్టో రూపొందింది. ప్రజల మనోభీష్టానికి అనుగుణంగా తయారైన మ్యానిఫెస్టో అన్ని వర్గాలకు చేరువై కూటమికి ఓట్లవర్షం కురిపించింది. ఉద్యోగాల్లేక నిరాశ, నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్న యువత ఒకవైపు... ఇంటినుంచి బయటకు వెళ్తే తిరిగి క్షేమంగా తిరిగివస్తామనే గ్యారంటీలేక భయాందోళనలతో బతుకుతున్న మహిళలు మరోవైపు, అడ్డగోలు బాదుడుతో బతుకుభారమైన జనసామాన్యం ఇంకోవైపు.. ఇలా బతుకు కష్టమైన బాధిత వర్గాలకు నేనున్నానంటూ లోకేష్ యువగళం యాత్రతో భరోసానిచ్చారు. ప్రజల కష్టాలువింటూ, కన్నీళ్లు తుడుస్తూ 226 రోజులపాటు సాగిన యువగళం పాదయాత్రలో వివిధ వర్గాల ప్రజలు చెప్పుకున్న సమస్యలు, వినతులను పాదయాత్ర పూర్తికాగానే యువనేత లోకేష్ నివేదిక రూపంలో పార్టీ అధినేతకు సమర్పించారు. పాదయాత్ర ముగిశాక విజయనగరం జిల్లా పోలేపల్లిలో నిర్వహించిన బహిరంగసభలో యువనేత ప్రసంగిస్తూ... 'పాదయాత్ర నాకు ఎన్నో పాఠాలు నేర్పింది.. నాయకుడు ఎంత బాధ్యతగా ఉండాలో తెలుసుకున్నాను. ఒక్క నాయకుడు చేసిన తప్పుల వలన రాష్ట్రప్రజలు ఎంత నష్టపోయిందో కళ్లారా చూసాను. జగన్ చేసిన విధ్వంసాన్ని ప్రతి అడుగులో చూసాను. ఉద్యోగాలు లేక యువత ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతున్నారు, నకిలీ విత్తనాలతో రైతన్న నష్టపోతున్నాడు, తాగునీటి కోసం మహిళలు బిందెలు మోసుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విజనరీ లీడర్ చంద్రబాబు తెచ్చిన ఎలెక్ట్రానిక్స్, ఐటీ కంపెనీలు కనిపించాయి... పాపాల పెద్దిరెడ్డి పది వేలకోట్ల అవినీతి సామ్రాజ్యం కనిపించింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో చంద్రన్న తెచ్చిన కియా, డ్రిప్ ఇరిగేషన్ కనపడింది... జగన్ తెచ్చిన కష్టాలు, కన్నీళ్లు కూడా కన్పించాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో చంద్రబాబు తెచ్చిన విమానాశ్రయం, మెగా సీడ్ పార్క్, జైన్ ఇరిగేషన్ ప్రాజెక్ట్, మెగా సోలార్ పార్క్, సిమెంట్ ఫ్యాక్టరీలు, సాగునీటి ప్రాజెక్టులు కనిపించాయి... జగన్ చేసిన విధ్వంసం, అక్కడ ప్రజల కన్నీళ్లు చూశాను' అని నవశకం సభలో లోకేష్ చెప్పుకొచ్చారు. యువనేతకు ఎదురైన ఈ అనుభవాలే మ్యానిఫెస్టోకు ప్రేరణయ్యాయి.



### యువనేత దృష్టికి అరాచక పాలకుల అకృత్యాలు

సుదీర్ఘ పాదయాత్రలో అరాచకపాలకుల అకృత్యాలను యువనేత లోకేష్ నేరుగా తెలుసుకున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో బీసీ మహిళ మునిరాజమ్మ జగన్ పాలనలో పడుతున్న బాధలని పాదయాత్ర సందర్భంగా యువనేతకు చెప్పుకుంది. దీంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి మునిరాజమ్మ టిఫిన్ బండిని ధ్వంసం చేసాడు. కాళ్లు పట్టుకొని క్షమాపణ కోరితే వదిలేస్తాం అన్నారు. అయినా ఆమె తగ్గలేదు. ఆమెకు యువనేత లోకేష్ అండగా నిలిచి, తిరిగి కొత్తషాపు ఏర్పాటు చేసుకునేందుకు ఆర్థిక సాయం అందించారు. పలమనేరుకి చెందిన మిస్బా తల్లితండ్రులు పాదయాత్ర సమయంలో లోకేష్‌ను కలిసారు. వైసిపి నాయకుడు కూతురు స్కూల్ ఫస్ట్ రావాలి అని మిస్బాకి టీసీ ఇచ్చి వేధించి ఆత్మహత్య చేసుకునేలా చేసారు. డాక్టర్ అవుతానని మిస్బా రాసుకున్న డైరీని చూసి యువనేత చలించిపోయారు. ఇటువంటి కడుపుకోతను మరే తల్లిదండ్రులకు రానీయబోనని ఆనాడే యువనేత ప్రతినబూనారు. ఎమ్మిగనూరులో రైతులతో సమావేశమైనప్పుడు రంగమ్మ అనే మహిళా రైతు తన భర్త 12 ఎకరాలు కౌలుకి తీసుకొని అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్నాడని కన్నీరు పెట్టుకుంది. ప్రభుత్వం చిల్లి గవ్వ ఇవ్వకపోవడంతో ఆ మహిళా రైతు కష్టాన్ని చూసిన లోకేష్ ఆమెకు పార్టీ తరపున సాయం అందించారు. మంత్రాలయం నియోజకవర్గం వలస కూలీలను కలిసినపుడు వ్యవసాయ పనులు లేక పిల్లలతో సహా సుదూర ప్రాంతాలకు వలస వెళ్లి వస్తున్న విషయం తెలుసుకుని యువనేత ఆవేదన చెందారు. ఆలూరు నియోజకవర్గంలో నీళ్ల కోసం మహిళలు కిలోమీటర్లు నడవడం చూసి అధికారంలోకి వచ్చాక సీమలో నీటికష్టాలు చూడరాదని నిశ్చయించుకున్నారు. ఇక్కడి ప్రజల కష్టాలను యువనేత చెప్పడంతోనే ప్రతిఇంటికి కుళాయి ద్వారా తాగునీరు అందిస్తామన్న హామీని కూటమి మ్యానిఫెస్టోలో పొందుపర్చారు.

### ప్రాంతాలవారీగా స్పష్టమైన హామీలు

యువగళం పాదయాత్ర ద్వారా వివిధ ప్రాంతాల సమస్యలనుప్రత్యక్షంగా తెలుసుకున్న యువనేత లోకేష్ ప్రాంతాల వారీగా స్పష్టమైన హామీలను ఇచ్చి భరోసా కల్పించారు. రాయలసీమ జిల్లాల ప్రజలు పడుతున్న కష్టాలు చూసిన తరువాత మిషన్ రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించారు. పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేస్తామని, హార్టీకల్చర్ హబ్‌గా తయారు చేస్తామని, స్పోర్ట్స్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా రాయలసీమను మారుస్తామని హామీ ఇచ్చారు. అన్నివిధాలా వెనుక బడిన ప్రకాశం జిల్లాను ఫార్మాహబ్‌గా మారుస్తామని, దశాబ్దాల కల అయిన వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఉభయగోదావరి, నెల్లూరు జిల్లాలో ఆక్వా రైతుల కష్టాలు చూసాక ఆక్వా, నాన్ ఆక్వా జోన్‌తో సంబంధం లేకుండా రూ. 1.50కే యూనిట్ విద్యుత్ అందిస్తామని ప్రకటించారు. మూడు ముక్కలాటతో రాజధానిని చంపేసి జగన్ పడుతున్న రాక్షస ఆనందం చూసిన లోకేష్... అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా రాజధాని అమరావతి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి, పూర్తిచేస్తామని చెప్పారు. జగన్ పాలనలో దారి తప్పిన ఉత్తరాంధ్రను గాడిలో పెట్టే బాధ్యత నేను తీసుకుంటానని, ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. విశాఖపట్నానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని, విశాఖను ఆదర్శ నగరంగా, ఐటీ క్యాపిటల్‌గా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. వీటితోపాటు సామాజికవర్గాల వారీగా యువనేత ఇచ్చిన పలు కీలకమైన హామీలు ఇచ్చారు.

బీసీల కోసం ప్రత్యేక రక్షణ చట్టం, దళితులను వేధించిన వారిని కఠినంగా శిక్షల అమలు, జగన్ రద్దు చేసిన 27దళిత సంక్షేమ కార్యక్రమాల పునరుద్ధరణ, ముస్లింల స్వావలంబనకు ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు వంటి వాటిలో మెజారిటీ హామీలు కూటమి మ్యానిఫెస్టోలో పొందుపర్చారు. యువనేత ప్రత్యక్షంగా తెలుసుకున్న సమస్యలతో రూపొందించిన హామీలే ఈ ఎన్నికల్లో కూటమికి ఓట్లవర్షం కురిపించాయి.







# ఎమ్మెల్యేలను పేరుపేరునా పలకరిస్తూ...

విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం జరిగిన ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేల సమావేశంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కలివిడిగా తిరుగుతూ అందరి అభిమానాన్ని పొందారు. మూడు పార్టీల ఎమ్మెల్యేలను పేరుపేరున పలకరించి ఘన విజయానికి అభినందనలు తెలియజేశారు. సీనియర్ ఎమ్మెల్యేల నుంచి ఆశీస్సులు తీసుకున్నారు. కొందరు ఎమ్మెల్యేలు లోకేష్‌ను శాలువాలు, బొకేలతో సత్కరించారు. పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మధ్య కూర్చున్న లోకేష్ వేదికపై పెద్దల ప్రసంగాలను ఆలకించారు.





























# ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేల సమావేశం దృశ్యాలు

















